

నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి, మతోన్మాదం, సామాన్య కష్టజీవులపై దోపిడీకి వ్యతిరేకంగా!
ఉద్యోగాలు, విద్య, వైద్యసదుపాయాలు, ఇళ్ళు , ప్రజల మధ్య సంఘీభావం, పోరాటాల ద్వారా ఐక్యత కోసం!



# భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర

(12 మార్చి 2023 - 14 ఏప్రిల్ 2023)

---

సోదర, సోదరీమణులారా! మిత్రులారా!

నేడు దేశం ఇంతకుముందెన్నడూ లేని సంక్షోభంలో పడిపోయింది. నిరుద్యోగం, అవినీతి, ఆర్థిక అసమానతలు, ఇదివరకటి రికార్డులన్నింటినీ బద్దలు కొడుతున్నాయి. మోడీ ప్రభుత్వం మోపుతున్న పన్నుల ధాటికి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కష్టపడి పనిచేసేవారి కడుపులు కొట్టి ధనవంతుల జేబులు నింపుతున్నారు. కాంగ్రెస్ మొదలుపెట్టిన సరళీకరణ-ప్రైవేటీకరణ విధానాల పెనుగాలి, మోడీ హయాంలో అడ్డూ అదుపు లేని తుఫానులా మారింది. మోడీ ప్రభుత్వం ఎన్నో *అబద్ధపు వాగ్దానాలు చేసింది కానీ వాస్తవానికి కార్మికుల జీవితాలు మాత్రం నరకంగా తయారయ్యాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి, పెరుగుతున్న దోపిడీ కారణంగా ప్రజలు ఇదివరకు ఎప్పుడూ లేనంత కష్టపడుతున్నారు.* ప్రజలను తమ హక్కుల కోసం పోరాడేందుకు ఐక్యం కానివ్వకుండా అడ్డుకునేందుకు, వారి అసమర్థతని కప్పిపుచ్చుకోవడానికి మతోన్మాదం-కులవివక్ష-అతివాద జాతీయవాదం వంటి తప్పుడు అంశాలతో సామాన్యులను బీజేపీ తప్పుదోవ పట్టిస్తోంది. బీజేపీ తాము 'జాతీయవాదులం' అని జబ్బలు చరుచుకుంటూ ప్రజల పెన్షన్లు, అలవెన్సులు, చివరికి సైనిక ఉద్యోగాలను కూడా మింగేసింది. చాలా భాగం కార్పొరేట్ల చేతిలో ఉన్న కారణంగా మీడియా కూడా నిజాలు చెప్పడం మానేసి, సమాజంలో మతోన్మాద విషాన్ని వ్యాప్తి చేస్తోంది.

బీజేపీ, కాంగ్రెస్ లే కాక బీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగు దేశం, ఆప్, ఎస్పీ, బీఎస్పీ, ఆర్జేడీ, జేడీయూ, ఎన్సీపీ, శివసేన, అకాలీ దళ్, డీఎంకే, ఏఐడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ లాంటి ప్రాంతీయ పార్టీలు కూడా తమ తమ రాష్ట్రాలలోని పెట్టుబడిదారులు, ధనిక రైతులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు, దళారీలు, బిల్డర్లకు సాధ్యమైనంత సేవ చేస్తున్నాయి. ఈ పార్టీలు కూడా ప్రజలని మతం, కులం, ప్రాంతం పేర్ల మీద విడదీసి, తమ రాజకీయ లబ్ధి కోసం, సీట్లు, ఓట్ల కోసం వాడుకుంటున్న పార్టీలే. మరోపక్క కార్మికవర్గ ప్రతినిధులమని చెప్పుకునే సీపీఐ, సీపీఎం, సీపీఐ-ఎంఎల్ (లిబరేషన్) పార్టీలు ప్రజల కోసం కొన్ని డిమాండ్లు పెడుతున్నప్పటికీ ఆచరణలో దోపిడీ చేస్తున్న వర్గాలకే ఉపయోగపడుతున్నాయి. వారు ప్రధానంగా పెద్ద పెట్టుబడిదారులకు కాకుండా చిన్న-మధ్య తరహా ప్రొప్రయిటర్లు-వ్యాపారస్తులు, ధనిక రైతులకు సేవ చేస్తున్నారు. ఈ పార్టీలు కూడా తాము అధికారంలోకి వచ్చిన చోటల్లా ఏమాత్రం సందేహించకుండా సరళీకరణ-ప్రైవేటీకరణ విధానాలనే అమలు చేస్తున్నాయి.

ఇవాళ, ప్రజలకు తమ కష్టాల నుండి విముక్తి పొందే మార్గం ఏదీ కనపడట్లేదు. ఈరోజు ప్రజలముందు ఎలాంటి ప్రత్యామ్నాయం కనిపించడంలేదు, ఈ పరిస్థితి ఎల్లకాలం కొనసాగాల్సిన అవసరం కూడా లేదు. సాహసవంతులైన ఈ దేశ యువత, చెమటోడ్చి జీవనం సాగిస్తున్న కార్మికులు-రైతులు ఖచ్చితంగా ముందుకొచ్చి ఈ పరిస్థితిని మారుస్తారు. అందుకే గత కాలపు విప్లవవీరుల వారసులుగా, వారి నుండి పొందిన స్ఫూర్తితో మేం ఈ *'భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర'*ను ప్రారంభించాం. *విప్లవం అవసరమైన సమాజంలోకి ఒక కొత్త వేకువ తేవడం, ప్రజలతో అసలు సమస్యల గురించి చర్చించి, ఐక్య పరచడమే ఈ యాత్ర లక్ష్యం.*

## ఉద్యోగావకాశాలపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడి మన జీవించే హక్కుపై దాడే!

2014 లో ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అలాంటి ప్రభుత్వం కనుసన్నలలోనే నేడు కొన్ని కోట్లమంది ప్రజల జీవనాధారాలు మాయమవుతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్ వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడంలో ప్రభుత్వం చాలా పొరపాట్లు చేసింది. ఈ పొరపాట్లే అసంఘటిత రంగంలోని ఎంతో మంది కష్టజీవులకి ఉద్యోగాలు లేకుండా చేశాయి. ప్రజా ధనంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలు ప్రైవేటుపరం చేసి, పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నారు. ఆ కారణంగా నేడు మెరుగైన విద్య, వైద్యం, కనీస అవసరాలతో సహా కేవలం డబ్బున్న వర్గాలకే అందుబాటులో ఉంటున్నాయి.

*32 కోట్ల* మంది ప్రజలు నేడు ఈ దేశంలో నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రభుత్వ శాఖలలోని కొన్ని లక్షల పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. *ఈ ప్రభుత్వం ఖాళీలను నింపే పని మానేసి, అసలు ఆ పోస్టులనే రద్దు చేస్తోంది. అగ్నిపథ్ స్కీమ్ పేరుతో చివరికి సైన్యంలో* కూడా పర్మనెంటు ఉద్యోగాలు లేకుండా చేసింది. కొత్తగా అమలవుతున్న *నూతన విద్యా విధానం-2020* (NEP) తో మతోన్మాదాన్ని

రగిల్చే ప్రయత్నం చేస్తోంది. ఈ ఎన్ఈపీ డాక్యుమెంటు ప్రైవేటురంగం పాత్రను పెంచి, ఉద్యోగాల సృష్టిని అడ్డుకునే డాక్యుమెంటు. గత ఎనిమిదేళ్ళలో *22 కోట్ల మంది (22,05,99,238)* ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకుంటే మోడీ ప్రభుత్వం సృష్టించింది కేవలం *7,22,311 ఉద్యోగాలే.* నేడు నిరుద్యోగం అత్యంత దారుణంగా ఉండడం వల్లే ఎంతో మంది తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. 2017-2021 మధ్య ఆత్మహత్య చేసుకున్న *7,20,611* వారిలో దినసరి కూలీలు, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, విద్యార్థులు, యువత, చిన్న తరహా పరిశ్రమలు నడుపుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. *ఈ 'అచ్చేదిన్' (మంచి రోజుల) గురించేనా మన చెవులు పగిలేలా గోదీ మీడియా రోజూ పాడుతోంది? ప్రజలకి ఉద్యోగాలు ఇవ్వలేకపోతే అసలు ప్రభుత్వం ఉన్నది ఎందుకు?* నిరుద్యోగం ఏ ప్రకృతి వైపరీత్యమో, జనాభా పెరుగుదల వల్ల వచ్చిన సమస్యో కాదు. పని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. సమాజం అభివృద్ధి చెందాల్సిన అవసరం, దానికి తగ్గ వనరులు కూడా ఉన్నాయి. అలాంటప్పుడు నిరుద్యోగంతో ప్రజలు ఎందుకు కష్టపడాలి? ఎందుకంటే లాభం కోసం మాత్రమే నడిచే సమాజంలో, వనరులను సరిగా వినియోగించరు. ప్రజలు నిరుద్యోగంతో బతుకీడుస్తుంటారు, ధనికులు మాత్రం 'అభివృద్ధి' తెచ్చే లాభాలను మెక్కుతూ, సామాన్య ప్రజలకు ఎంగిలి మెతుకులు విదిలిస్తూ ఉంటారు.

## మోడీ ప్రభుత్వ పుణ్యంతో ఆకాశాన్ని అంటుతున్నధరలు!

అధికారంలోకి వచ్చే ముందు నరేంద్ర మోడీ, బీజేపీ చెవులు దద్దరిల్లేలా కేకలేసిన మరో నినాదం, "బాహుత్ హుయీ మెహంగాయీ కి మార్, అబ్ కీ బార్, మోడీ సర్కార్"! (ధరలు కొట్టిన దెబ్బలు చాలు, ఇక రావాలి మోడీ సర్కార్) కానీ తాము అధికారంలో ఉన్న ఎనిమిదేళ్ళలో మోడీ ప్రభుత్వం ధరలు, ద్రవ్యోల్బణం విషయంలో అదీ ఇదీ అని తేడా లేకుండా అన్ని రికార్డులూ బద్దలు కొట్టేసింది. ఉప్పు, పప్పు మొదలు, వంట గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఒక రిపోర్టు ప్రకారం, ఒక సామాన్య భారతీయుడు తన ఆదాయం మొత్తంలో *53 శాతం* ఆహారం మీదే ఖర్చు పెడుతున్నాడు. అదే సమయంలో ధనికులు కేవలం *12 శాతం* ఆదాయాన్నే ఆహారానికి ఖర్చు చేస్తున్నారు. ఈ రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన సంక్షోభ భారం మొత్తం సామాన్య ప్రజలపైకే నెట్టబడుతోంది. రూ 450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ *1,100* కి చేరుకుంది, డీజిల్ ధర లీటర్ కి రూ 55 నుండి *రూ 95* కి, పెట్రోల్ రూ 75 నుండి *రూ 100* కి పైగా పెరిగాయి. మోడీ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల రూపంలో ప్రజల *నుండి వసూలు చేసిన పెద్ద మొత్తాన్ని నేడు ధనికులకి పన్ను మినహాయింపులు ఇవ్వడానికి, రాజకీయ నాయకులు, సీనియర్ అధికారులకు పెద్ద జీతాలివ్వడానికి, వారి పెన్షన్లకు, విలాసాలకు ఉపయోగిస్తోంది.* పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను పెరిగిన ప్రతీసారి, దాని ప్రభావం మిగిలిన వినియోగ వస్తువుల ధరలపై కూడా పడుతుంది. *ఒకవైపు ప్రజలపై అంతకంతకీ పన్నుల భారం పెంచుతున్న ప్రభుత్వం, మరోవైపు పెట్టుబడిదారుల నుంచి వసూలు చేసే పన్నులను రోజురోజుకీ తగ్గించుకుంటూ పోతోంది!* ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రభుత్వానికి వాటాలు ఉన్న బ్యాంకులు ప్రజల కష్టార్జితాన్ని అంబానీ-అదానీ-టాటా-బిర్లాలకు అప్పులుగా ఇస్తున్నాయి. 2015-2021, *ఈ ఆరేళ్ళలో తిరిగి చెల్లించని, చెల్లించలేని వారికి 11 లక్షల 19 వేల కోట్ల రూపాయలు* అప్పుగా ఇచ్చేశారు. ఆ మొత్తంలో కేవలం ఒక లక్ష కోట్లను మాత్రమే ప్రభుత్వం రికవర్ చేయగలిగింది. అంటే, 10 లక్షల 19 వేల కోట్ల ప్రజాధనాన్ని పెట్టుబడిదారులు మింగేశారు. 2004 నుండి 2014 మధ్యలో పెట్టుబడిదారులకు మాఫీ చేసిన ఋణాల మొత్తం 2 లక్షల 22 వేల కోట్లు! *రూ 25 లక్షల కంటే ఎక్కువ మొత్తం ఎగ్గొట్టిన ఎగవేతదారుల సంఖ్య 15,000 కి చేరుకుంది. 40 మంది ధనికులు ప్రజల ధనం కాజేసి దేశం దాటి వెళ్ళిపోయారు. ప్రభుత్వం పాత్ర ఏమీ లేకుండా ఇలా జరిగే అవకాశం ఉంటుందా? ఈ నిలువు దోపిడీ వల్ల వస్తున్న నష్టాన్ని పూడ్చే పని కూడా అధిక ధరల రూపంలో ప్రజల నెత్తిపైనే మోపుతున్నారు.* కాబట్టి ధరల పెరుగుదలని ఈ దొంగలు, ప్రభుత్వం కలిసి ప్రజలపై చేస్తున్న దాడిలాసే చూడాలి.

## బీజేపీ రెండు నాల్కల ధోరణి, 'సంస్కారవంతమైన' బీజేపీ 'మోసపూరిత వ్యూహం'!

*నోరు తెరిస్తే విలువలు, సంప్రదాయం, సంస్కారం అని శ్రీరంగ నీతులు చెప్పే బీజేపీ నాయకులు అవినీతిలో రికార్డులు తిరగరాస్తున్నారు.* 'తినను, తిననివ్వను' అన్న మోడీ నినాదం వెనుక అసలు నిజం నేడు బయట పడిపోయింది. వారి హయాంలో తినడం, దోచిపెట్టడం ముందెన్నడూ లేనంత ఊపుతో జరిగిపోతున్నాయి. దీనికి *రఫేల్ ఒప్పందం, పీఎం కేర్స్ నిధి, వ్యాపామ్ స్కామ్* దగ్గర మొదలుపెడితే, మొన్నటి అదానీ మెగా కుంభకోణం వరకు ఎన్నో సాక్ష్యాలున్నాయి. *హిండెన్బర్గ్ విడుదల చేసిన నివేదిక అదానీతో నేటి ప్రభుత్వం కుమ్మక్కైన విధానాన్ని తేటతెల్లం చేస్తోంది.* బీజేపీ నాయకులు, వారికి ప్రీతిపాత్రులయిన ధనికులు, మోడీ హయాంలో ఎంతో ఘనంగా లాభపడ్డారు. అందుకే బీజేపీ కోసం తమ ఖజానాలను బార్లా తెరిచారు! దానికి బదులుగా బీజేపీ, నిరంతరం తన మతోన్మాద విధానాలతో, ప్రజల మధ్య ఐక్యతను చెడగొడుతూ, తన పెట్టుబడిదారీ విధానాల ద్వారా ధనికులకు మరింత దోచిపెడుతోంది. ఇక మనం చేయడానికి మిగిలింది ఏంటయ్యా అంటే, పెట్టుబడిదారుల ఖజానాలు నింపేందుకు రేయింబవలు కష్టపడడం, ఆపై మత ఘర్షణల్లో మన తలలు మనమే బద్దలు కొట్టుకోవడం! *ఒక్కసారి ఆలోచించండి! మత ఘర్షణల్లో ఎప్పుడూ అత్యంత ధనికుల ఇళ్ళో, రాజకీయ నాయకులు, మంత్రులు, లేదా ఆఫీసర్ల ఇళ్ళో ఎందుకు తగలబడవు? కత్తులు, కర్రలు, శూలాలు పట్టుకుని ఇళ్ళు తగలబెట్టే వారిలో వాళ్లెందుకు కనపడరు? వారి పిల్లలకేమో క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్లుగా నియమించడం ద్వారానో, మరో రకంగానో డబ్బు వెనకేసుకునే అవకాశాలు ఇచ్చుకుంటారు, మీ కొడుకులు, కూతుళ్ళ చేతుల్లో ఆయుధాలు పెట్టి మత కలహాలు రేపే పని చెప్తారు. ఆగి ఆలోచించండి, ఇంకెన్నాళ్ళు ఈ కుతంత్రాలకి బలవుతారు?*

## రికార్డు స్థాయిలో పేదరికం, ఆర్థిక అసమానతలు!

దేశంలో దారిద్ర్యం రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య *23 కోట్లకి* చేరుకుంది. ప్రపంచంలోని మరే దేశంలోనూ ఇంత మంది పేదలు లేరు. మన దేశంలో దారిద్య్ర రేఖకి దిగువన ఉన్నారంటే అర్థం ఆకలికి అల్లాడుతున్నారనే. అక్టోబర్ 2022 లో విడుదల అయిన ప్రపంచ ఆకలి సూచికలో 121 దేశాలు ఉంటే *భారత్ స్థానం 107!* 2019 చివర్లో వచ్చిన లెక్కల ప్రకారం, దేశంలో *8,24,000 మంది పసిబిడ్డలు చనిపోయారు. అంటే ప్రతి రెండు నిమిషాలకి, ముగ్గురు పసిపాపలు మరణిస్తున్నారు!* ఆకలి, పిల్లల మరణాల విషయంలో ఆఫ్రికాలోని పేద దేశాల కన్నా భారత్ ఎంతో వెనకబడి ఉంది. 1981 లో మొత్తం దేశసంపదలో *45 శాతం* పైనున్న *10 శాతం* మంది చేతుల్లో ఉంటే, 2012 నాటికి దేశంలోని సంపదలో *63 శాతం* ఆ పదిశాతం చేతుల్లోకే వెళ్ళిపోయింది, 2022 నాటికి *80 శాతం* సంపద 10 శాతం ధనికుల చేతుల్లో ఉంది. ఈరోజు, దేశసంపదలో *90 శాతం,* కేవలం *30 శాతం* ధనికుల చేతుల్లోనే ఉంది. పైనున్న ఒక శాతం మంది ధనికుల చేతుల్లోనే 40 శాతం సంపద ఉంది. కిందనున్న *50 శాతం* మంది ప్రజల వద్ద ఉన్నది దేశ సంపదలో *3 శాతం మాత్రమే. పెరుగుతున్న సంపదలొక వైపు, ఆకలితో మాడుతున్న చిన్నారులు మరోవైపు!* లాభం ఆధారంగా మాత్రమే నడిచే వ్యవస్థ అంటూ భగత్ సింగ్ మనల్ని హెచ్చరించిన వ్యవస్థ అసలు రూపం ఇదే.

## మతోన్మాద తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదాం!

పైన పేర్కొన్న అసలు విషయాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకే నేడు దేశంలో *మతోన్మాద చిచ్చు రగల్చబడుతోంది.* 'విభజించి పాలించు' అనే పాలసీ ద్వారా బ్రిటిష్ వారు మనపై అధికారం చెలాయించారు. మొదట ప్రజల్ని విభజించి,తర్వాత దేశాన్ని కూడా విడదీశారు. 'రెండు దేశాల సిద్ధాంతాన్ని' ముస్లిం లీగుతో పాటు ఆర్ఎస్ఎస్, హిందూ మహా సభల హీరో అయిన సావర్కర్ కూడా బలపరుస్తూ వచ్చాడు. స్వాతంత్ర్యం తర్వాత ధనికుల ప్రతినిధులే దేశంలో అధికారంలోకి వచ్చారు. వారు కూడా ప్రజలని తమలో తాము పోట్లాడుకొనేలా చేసేందుకు చేయని ప్రయత్నం లేదు. కాంగ్రెస్ తో పాటు మిగిలిన ప్రాంతీయ పార్టీలు కూడా మతం వెనక దాక్కొని తప్పుడు లౌకికవాదాన్ని ప్రచారం చేసేవే. ఇక సంఘ్ పరివార్, బీజేపీల అజెండా ఎప్పుడూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజా ఉద్యమాలని చీల్చడమే. అందుకు ప్రతిఫలంగానే పెట్టుబడిదారుల నుండి వారికి టన్నుల కొద్దీ డబ్బు ముట్టింది. 2014 లో అధికారంలోకి రాక ముందు నుండే ఈ విధంగా ఆ పార్టీపై డబ్బు కురవడం మొదలైంది. *2012-13 మొదలు 2015-16 వరకు, నాలుగేళ్ళలో ఐదు జాతీయ పార్టీలు చందాల రూపంలో వసూలు చేసిన డబ్బు 956 కోట్ల 57 లక్షల రూపాయలయితే, అందులో 74 శాతం, అంటే 705 కోట్ల 81 లక్షలు ఒక్క బీజేపీకే ముట్టాయి!* ఒక్క 2021-22 సంవత్సరంలోనే కార్పొరేట్ చందాల రూపంలో బీజేపీకి ముట్టిన మొత్తం *రూ 615 కోట్లు.* ఇది మిగిలిన రాజకీయ పార్టీలన్నీటికీ వచ్చిన డబ్బు కన్నా అనేక రేట్లు ఎక్కువ. 2020 ఆర్థిక సంవత్సరంలో బీజేపీ ఇచ్చిన లెక్కల ప్రకారం, ఆ పార్టీకి ఉన్న సంపద *రూ 4,847 కోట్ల 78 లక్షలు.* ఈ సంఖ్య 2017 లో రూ 1,213 కోట్ల గా ఉండేది. *ఎవరైనా డబ్బిచ్చిన వాడి పాటే పాడతారన్న* విషయాన్ని మనం *మర్చిపోకూడదు!* చరిత్ర లో అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా, కాంగ్రెస్ మొదలు, ప్రాంతీయ పార్టీల వరకు, ప్రభుత్వాలన్నీ పెట్టుబడిదారీ వర్గానికి ఏదో ఒక విధంగాసేవ చేస్తూనే వచ్చాయి. అయితే ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పుడు, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండి మళ్ళించి, తమలో తామే పోట్లాడుకొనేలా చేయడానికి మతం పేరుతో వారిని అణిచివేసే బీజేపీ లాంటి పార్టీ ఒకటి పెట్టుబడిదారీ వర్గానికి అవసరం అవుతుంది. *బీజేపీ, సంఘ్ పరివార్ లు సమాజంలో నాటిన ఫాసిస్టు మత వెర్రి, ఒవైసీ, పీఎఫ్ఐ, అమృత్ పాల్, వంటి మత ఛాందసులు బలపడేందుకే ఉపయోగపడుతుంది. మతోన్మాద, తీవ్రవాద మత రాజకీయాలు, కేవలం జీవితాలు నాశనం కావడానికీ, సామాన్య ప్రజలకి ఉన్న అరకొర ఆస్తులు కూడా ధ్వంసం కావడానికే ఉపయోగపడతాయి. ఏ యోగి ఇల్లో, ఒవైసీ ఇల్లో ఎప్పుడూ తగలబడదు.*

*ప్రజలు తమలో తాము కలహించుకోకుండా ఉండడానికి వర్గ స్పృహ ఎంతో అవసరమని భగత్ సింగ్ చెప్పిన మాట సరైనది. ఇది ఈరోజుకీ అంతే నిజం.* కులం, మతం, భాష, ప్రాంతాలు వేరైనా కష్టజీవులు, కార్మికవర్గానికి ఉన్న సమస్యలు ఒక్కటే, వారిని దోపిడీ చేస్తున్న శక్తులూ ఒకరకమైనవే. మనం సంఘటితమై పోరాడినప్పుడే మన హక్కులను సాధించుకోగలుగుతాం. ఇవాళ మతానికీ, రాజకీయాలకీ, సామాజిక జీవితానికీ మధ్య సంబంధం లేకుండా చేసే అసలైన లౌకికవాదం కోసం మనం డిమాండ్ చేయాలి. లేకపోతే మతోన్మాద రాజకీయాలు ఇతర దేశాలలో ప్రజల జీవితాలని నాశనం చేసినట్టు మనల్నీ నాశనం చేస్తాయి. మతోన్మాదం, ఏ రంగుదయినా కూడా దాన్ని మనం తిరస్కరించాలి.

*మిత్రులారా, మన జీవితాలకి సంబంధించిన అసలు సమస్యల ఆధారంగా ఐక్యమై, మనందరం ఒక కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టాలి.* నేడున్న వ్యవస్థ మనకి విద్య, ఉద్యోగాలు, వైద్యం, ఇళ్ళు, సామాజిక-ఆర్థిక భద్రత, ప్రజాస్వామ్య విలువలు, అసలైన లౌకిక వాదం, ప్రజానుకూల సంస్కృతి, విలువల్ని ఇవ్వలేకపోతే, ఒక కొత్త వ్యవస్థని నిర్మించుకోవాలి. ఉత్పత్తి యొక్క నియంత్రణ, రాజ్య యంత్రాంగం, మొత్తం సామాజిక నిర్మాణం కష్టించి పనిచేసే కార్మికుల చేతుల్లోనే ఉండే వ్యవస్థని నిర్మించుకోవాలి. *అయితే ఈ సుదూర లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్య, ఉద్యోగాలు, వైద్యం, ఇళ్ళ వంటి మన ప్రాథమిక హక్కుల కోసం ప్రభుత్వాలని డిమాండ్ చేస్తూ, పోరాటాలని నిర్మించాలి.* ఇటువంటి పోరాటాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడానికే ఈ *భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర* మొదలైంది. ఇది మన కోసం మనందరం చేస్తున్న ఉద్యమం. *మీరు కూడా ఇందులో పాలుపంచుకోవాలి.*

## మా ప్రధాన డిమాండ్లు

⇨విద్య-ఉద్యోగాలు-వైద్యం-ఇళ్ళు ప్రాథమిక హక్కులుగా ప్రకటించాలి. ప్రైవేటీకరణ నిషేధించాలి. *భగత్ సింగ్ జాతీయ ఉద్యోగ హామీ* చట్టం పాస్ చేయాలి, ఉద్యోగం కల్పించలేని పక్షంలో నెలకు కనీసం రూ 10,000 నిరుద్యోగ భత్యం చెల్లించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలోని ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలి. *'అగ్ని పథ్'* స్కీమును వెంటనే ఉపసంహరించుకుని, పర్మనెంట్ రిక్రూట్ మెంట్ విధానాన్ని పునఃప్రారంభించాలి.

⇨కార్మిక చట్టాలన్నింటినీ ఖచ్చితంగా అమలు చేయాలి. ఇటీవల ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకోవాలి. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి, ఉన్న ఉద్యోగాలన్నింటినీ రెగ్యులర్ చేయాలి.

⇨ధరల పెరుగుదలని అడ్డుకునేందుకు *పరోక్ష పన్నులన్నింటినీ రద్దు చేయాలి, ఆదాయంతో* పాటు పెరిగే ప్రత్యక్ష పన్ను వ్యవస్థని ఖచ్చితంగా అమలు చేయాలి.

⇨*జాతీయ ఉపాధి హామీ* పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. ఏడాది పొడవునా పని కల్పించే ఏర్పాట్లు చేయాలి, ఆ పని చేసినందుకు గాను కనీస వేతనాలు ఇవ్వాలి.

⇨*పేద, మధ్య తరగతి రైతులకు* విత్తనాలు, ఎరువులు, కరెంటు వంటి సదుపాయాలు కల్పించాలి. అందుకు అవసరమయ్యే డబ్బును *ధనిక వర్గం నుంచి ప్రత్యేక పన్నుల రూపంలో* వసూలు చేయాలి. ఈ రైతులకు నీటి పారుదల వసతులు, బ్యాంకులలో రుణాలు వచ్చే ఏర్పాట్లను ప్రభుత్వమే చేయాలి.

⇨'సర్వ ధర్మ సమభావం' అనే నకిలీ లౌకికవాదం బదులు మతంతో సంబంధం లేని అసలైన లౌకిక రాజ్యంగా భారత్ ని మార్చే చట్టం తీసుకురావాలి. మతం, విశ్వాసాలను గురించి రాజకీయ నాయకులు కానీ, పార్టీలు కానీ మాట్లాడడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలి.

⇨*అంటరానితనంతో పాటు కులవివక్షను, అది ఏ రూపంలో ఉన్నా, శిక్షార్హమైన నేరంగా* పరిగణించే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలి.

⇨ప్రభుత్వాల మరియు ఎన్నికల్లో పాల్గొనే పార్టీల *అవినీతిని విచారించేందుకు ప్రజా ఆడిట్లు* నిర్వహించాలి.

⇨*మహిళలు ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివక్షలన్నింటినీ అంతం చేసే విధంగా కఠినమైన చట్టాలు తేవాలి.*

⇨సమాజంలో *విద్వేషాలు రెచ్చగొడుతూ, గుంపులుగా చట్టాన్ని చేతిలోకి తీసుకుంటూ, మతపరమైన హింసలో పాల్గొంటున్న సంస్థలని, పార్టీలని తీవ్రవాద సంస్థలుగా గుర్తించి,* ఆయా సంస్థల నాయకులపై, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

కామ్రేడ్స్, ఇవి మన జీవితాలకి సంబంధించిన కొన్ని ప్రాథమిక డిమాండ్లు. వీటిలో ఏవీ నెరవేర్చలేనివి కావు. నిజానికి, వీటిలో చాలా హక్కులు చాలా దేశాలలో అమలులో ఉన్నవే. తమ పోరాటాల ద్వారా ఆయా దేశాల ప్రజలు సాధించుకున్నవే. ఇక్కడెందుకు సాధించుకోలేం? ప్రజల కనీస అవసరాలను తీర్చలేని ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత లేదు. మీరు కనుక మాతో ఏకీభవిస్తే, మేం పైన పేర్కొన్న డిమాండ్ల గురించి ఆలోచించండి, వాటి కోసం సంఘటితం అవ్వండి, ఈ పోరాటంలో మాతో కలవండి. మతం, కులం, ప్రాంతం, భాషల తేడాలు మరిచి మనందరం ఏకం కావాల్సిన తరుణమిది. ఇవాళ పోరాడకపోతే, భవిష్యత్తు మనల్ని క్షమించదు.

**అంధకారం తొలగిపోతుంది.. పోరాడేవారే ఆటంకాలను అధిగమిస్తారు!**

---

ఈ కరపత్రాన్ని డౌన్ లోడ్ చేసుకునేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

BHAGAT SINGH JAN ADHIKAR YATRA
BSJAY

యాత్రలో వాలంటీర్ గా చేరేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

# ●రెవల్యూషనరీ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా (RWPI)

## ●నౌ జవాన్ భారత్ సభ ●దిశ విద్యార్థి సంఘం ●బిగుల్ మజ్దూర్ దస్తా

కాంటాక్ట్:- తెలంగాణ: 9100896812, 7036470438; ఢిల్లీ: 9289498250, 9693469694; ఉత్తర్ ప్రదేశ్: 8858288593, 9891951393; హర్యానా: 8010156365, 8685030984; మహారాష్ట్ర: 7798364729, 9619039793; బిహార్: 6297974751, 7070571498; ఉత్తరాఖండ్: 9971158783, 7042740669; పంజాబ్: 9888080820; ఆంధ్ర ప్రదేశ్: 7995828171, 8500208259; చండీగఢ్: 8196803093

@bsjayatra 7036470438

ప్రచురణ - భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర ( BSJAY), తేదీ 16 మార్చి 2023.